
చిన్నకథ

# నాకిలాంటివి నచ్చవ్!

భీమరాజు వెంకటరమణ

**''కొత్త మేనేజరు గారు వచ్చేసారు'' అంటూ స్టాఫ్ అంతా పరుగెత్తుకుంటూ బయటకు వచ్చారు, తలా ఒక పూలమాల పట్టుకొని. కంపెనీ వారు ఏర్పాటు చేసిన కారులో ఠీవిగా దిగాడు కొత్త మేనేజరు నాగరాజ్. స్టాఫ్ పూల మాలలు వెయ్యబోతే'' చూడండి నాకిలాంటివ్ నచ్చవ్'' అన్నాడు మొహం సీరియస్‌గా పెడుతూ. '' పని ముఖ్యం! మిగతావి ఏవీ నాకు నచ్చవ్'' అన్నాడు మళ్ళీ.**




అందరు ఒకరి ముఖం ఒకరు చూసుకొని తమను పరిచయం చేసుకోవడం మొదలు పెట్టారు. ''సర్! నా పేరు గోవిందరావు, సీనియర్ అకౌంటెంట్‌ని'', ''సర్! నా పేరు రామారావు, క్యాషియర్‌ని'', ''సర్! నా పేరు రోజా, కంప్యూటర్ ఆపరేటర్‌ని'', ''నా పేరు నర్సింగ్ సార్! అటెండర్‌ని'' అంటూ మేనేజర్ చేతిలో బ్రీఫ్ కేస్ అందుకున్నాడు నర్సింగ్. అందరితో కలిసి లోపలికి నడిచాడు నాగరాజ్.

లోపలికి అడుగు పెడుతూనే నోరు తెరుచుకొని నిలబడిపోయాడు నాగరాజ్. ''ఇదేమిటయ్యా! ఇది ఇంపోర్ట్ ఎక్స్‌ఫోర్ట్ వ్యాపారం చేసే సంస్థనా లేక ఏదైనా స్వాముల వారికి సంబంధించిన మఠమా? 'ఏమిటి? ఖాళీ లేకుండా ఈ క్యాలెండర్లు, ఈ ఫోటోలు?' ఆశ్చర్యంగా అడిగాడు.

గోవిందరావు కలుగచేసుకొని ''ఏదో సార్ మన వ్యాపారం బాగా అభివృద్ధిలోకి రావాలని స్టాఫ్‌లో ఎవరు ఏ పుణ్యక్షేత్రానికి వెళ్ళినా తలా ఒక ఫోటో తెచ్చి తగిలిస్తూ వుంటాము సార్'' అన్నాడు. ''అంటే ఈ ఫోటోల సంఖ్య చూస్తే మీరంతా ఆఫీస్‌లో పని చేసిన దానికంటే ఊర్లు తిరిగిందే ఎక్కువగా కనబడుతున్నది, నాకిలాంటివి నచ్చవ్, ఏదో ఒకటో, రెండో వుంచి మిగతావన్నీ రేపు ఉదయానికల్లా తీసివెయ్యాలి అర్థం అయ్యిందా?'' అంటూ కోటు సవరించుకొని తన ఛాంబర్ వైపు వెళ్ళాడు నాగరాజ్. అందరూ ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు మళ్ళీ.

తన సీట్లో కూర్చున్న వెంటనే టేబుల్ పై ఉన్న కాలింగ్ బెల్ నొక్కాడు నాగరాజ్. ఎవరూ రాలేదు. మరొకసారి నొక్కాడు. లాభం లేదు. చిరాకుగా ఒక్క ఊపున లేచి డోర్ తీసి చూసాడు. అందరూ వాళ్ళ వాళ్ళ సీట్లలో కూర్చొని మౌనంగా ఏదో చేస్తున్నారు.

''బెల్ కొట్టినా వినిపించుకోకుండా వీళ్ళంతా ఏం చేస్తున్నారు?'' అనుకుంటూ మొదట రోజా దగ్గరకు వెళ్ళాడు. ఆమె సీరియస్‌గా రామ కోటి రాస్తున్నది. టేబుల్ మీద అరచెయ్యి వెనక్కు త్రిప్పి వేళ్ళతో ఠపాఠపామని కొట్టాడు. ఆమె వినిపించుకోలేదు. మళ్ళీ కొట్టాడు. కాసేపు ఆగమన్నట్లు చేతితో సైగ చేసి మళ్ళీ రాసుకుంటున్నది. నాగరాజ్‌కు ఒళ్ళు మండుతున్నది. అసహనంగా అక్కడే నిలబడ్డాడు. వ్రాయటం అంతా పూర్తయ్యాక తలెత్తి ''సారీ సార్! రామకోటి రాసేటప్పుడు మధ్యలో ఆపకూడదు'' అన్నది రోజా.

''నీకు పట్టుమని పాతిక ఏళ్ళు ఉండవు ఈ రామకోటి రాయటం ఏమిటీ? అదీ ఇక్కడ ఆఫీస్‌లో,

నాకిలాంటివి నచ్చవ్'' అన్నాడు నాగరాజ్. ''రామ కోటి రాయడానికి వయసుతో పనేముంది సార్! ప్రతిరోజు ఆఫీస్‌కి వచ్చి సీట్లో కూర్చోగానే నూట ఎనిమిదిసార్లు రామకోటి రాసి పని మొదలుపెడితే ఏ ఆటంకాలూ ఉండవు సార్!'' అన్నది రోజా.

నాగరాజ్‌కి తోక తొక్కినట్లయింది. ''వాటిజ్ దిస్! వాటిజ్ గోయింగ్ ఆన్ హియర్'' అంటూ గోవింద రావు సీటు వైపు చూసి అక్కడకు వెళ్ళాడు. అతను ఏదో స్తోత్రపఠనం చేస్తున్నాడు. ఈసారి టేబుల్ మీద కొట్టకుండా ''గోవిందరావ్! మిస్టర్ గోవింద రావ్'' అని దాదాపు అరిచాడు. అసలు ఆయన ఈ లోకంలోనే లేడు. పరవశంతో స్తోత్రాలు పఠిస్తున్నాడు. స్టాఫ్ నిర్లక్ష్యవైఖరి నాగరాజ్‌లో కోపాన్ని పెంచింది. ఇక అక్కడ నిలబడటం ఏదోలా అనిపించింది. రుసరుసలాడుతూ వచ్చి తన ఛాంబర్‌లో కూర్చున్నాడు.

పదకొండు దాటింది. మళ్ళీ కాలింగ్ బెల్ నొక్కాడు. ఈసారి అటెండర్ తలుపు తీసుకొని లోపలికి వచ్చి ''ఏమి కావాలి సార్?'' అని అడిగాడు. ''ఏమయ్యా! ఇందాకటినుంచి ఎక్కడికెళ్ళావు? ఎన్ని సార్లు బెల్ కొట్టినా రావేంటి?'' కోపంగా అడిగాడు నాగరాజ్. '' అదేం లేదు సార్! క్యాషియరు గారు కర్పూరం అగరుబత్తీలు అయిపోయాయి, తెమ్మంటే వెళ్ళాను సార్'' అన్నాడు. ''కర్పూరం అగరు బత్తీలా? అవెందుకు ఇప్పుడు?'' అని అడుగుతుండగా గోవిందరావు లోపలికి వచ్చాడు. బుస్‌మన్నాడు నాగరాజ్. ''ఏమిటి మిస్టర్ గోవింద రావ్? ఏమిటి మీరు చేస్తున్నది?'' అడిగాడు కోపం, ఆశ్చర్యం కనబరుస్తూ.

''ఏమీ లేదు సార్! నాలుగంటే నాలుగే స్తోత్రాలు చదివి పని మొదలు పెట్టడం నాకు అలవాటు సార్! ఆఫీస్‌కి శుభం జరగాలంటే ఆ మాత్రం చేయక తప్పదు సార్!'' అన్నాడు కాన్ఫిడెంట్‌గా. ''చెప్పానుగా నాకిలాంటివి నచ్చవ్ అని, మీకంటే క్యాషియర్ రామారావు బెటర్‌లా ఉన్నాడు చక్కగా పని చేసుకుంటున్నాడు'' అన్నాడు కిటికీలోనుంచి చూపిస్తూ. ''అట్లాంటిది ఏమీ లేదు సార్! కాకపోతే మా పని అయ్యాక అతను మొదలుపెడతాడు. రండి సార్! చూద్దురు గాని'' అని రామారావు దగ్గరకు తీసుకెళ్ళాడు నాగరాజ్‌ని.

అప్పటికే మిగిలిన వాళ్ళందరూ అక్కడకు చేరారు. రామరావు క్యాష్ సేఫ్ తెరచి ముందు అగరు వత్తులు అంటించి ఆ తరువాత లోపల ఉన్న క్యాష్‌కి, కొన్ని పుస్తకాలకి హారతి ఇవ్వడం మొదలు పెట్టాడు. రామారావులో పాటు గోవిందరావు, రోజా కూడా హారతి పాట అందుకున్నారు.

మేనేజర్ నాగరాజ్ ముఖం కందగడ్డలా మారిపోయింది. హారతి అయిందాక ఏమి చేసినా లాభం లేదు కాబట్టి ఓపిక పట్టి కాగానే ''ఏమిటయ్యా! ఈ హారతులు ఏమిటి? పొరపాటున లోపల కరెన్సీకి మంట తగులుకుంటుందేమోనని హడలి చచ్చాను కదయ్యా! మొదటి రోజే నాకు గుండె ఆగినంత పని చేసారు. అసలు ఏమిటి ఈ చాదస్తం? మీ ముగ్గురి వ్యవహారం టూమచ్‌గా వుంది. ఆ కంప్యూటర్లకి అలా పసుపు రాసి బొట్టు పెట్టడం ఏమిటీ? ముత్తైదువుకు పెట్టినట్లు? ఈ క్యాలికులేటర్లకు ఈ తాయత్తులేమిటి? నాకు పిచ్చి ఎక్కేట్లుంది. నాకు ఇలాంటివి నచ్చవ్!

సరే! అయిందేదో అయిపోయింది .. పూజలు కావాలంటే ఏ శుక్రవారమో, శనివారమో పెట్టుకోండి. కాని రేపటినుండి ఈ ఆఫీస్ రూపం మారిపోవాలి. గోడలు ఖాళీగా వుండాలి. కంప్యూటర్లు వాటి అసలు రూపంలో శుభ్రంగా వుండాలి. లేకపోతే మీ అందరిపైనా హెడ్ ఆఫీస్‌కి కంప్లయింట్ చేయాల్సివస్తుంది. దట్సాల్!'' అంటూ విసురుగా తన ఛాంబర్లోకి వెళ్ళాడు.

మరుసటి రోజు ఉదయం నాగరాజ్ ఆఫీస్‌కి వచ్చేసరికి నిజంగానే అంతా మారిపోయింది. గోడలు ఖాళీగా ఉన్నాయి. కంప్యూటర్లు ఫ్రెష్‌గా కనబడుతున్నాయి. కానీ అందరూ ముఖం మాడ్చుకొని పని చేసుకుంటున్నారు. ''అలవాటు అయిన పనులు కదా! వద్దన్నందుకు ఫీల్ అయి వుంటారు, నాలుగు రోజులు పోతే వాళ్ళే సర్దుకుంటారు'' అనుకొని తను తెచ్చిన మార్పుకు సంతోషపడుతూ లోపలికి వెళ్ళాడు.

ఆఫీస్‌లో పని సీరియస్‌గా జరుగుతున్నది. కొంతమంది కస్టమర్లు వస్తున్నారు, పోతున్నారు. గోవిందరావ్, రామారావ్‌లు పనిలో తలమునకలై ఉన్నారు. అటెండర్ నర్సింగ్ కూడా బిజీగా కాగితాలు అటూ ఇటూ చేరవేస్తూ మధ్య మధ్యలో నాగరాజ్ చేత సంతకాలు పెట్టించుకొని వెళుతున్నాడు.

సాయంత్రం అయిదు గంటలు దాటింది. అకౌంట్స్ పూర్తి చేసి ఒక బుక్ తీసుకు వచ్చి నాగరాజ్ ముందు ఉంచి గోవిందరావ్ ''సార్! ఇవాల్టి ట్రాన్సాక్షన్స్ అన్నీ ఇందులో నోట్ చేసాను, ఒకసారి చెక్ చెయ్యండి'' అన్నాడు. ఒక్కొక్కటిగా చూస్తూ నాగరాజ్ ''ఇదేమిటి? మాధవీ ఎంటర్‌ప్రైజెస్‌కి పంపాల్సిన డబ్బు, మోహన్ ఎంటర్‌ప్రైజెస్‌కి పంపినట్లు ఉంది?'' అని ఆశ్చర్యంగా అడిగాడు. గోవిందరావు బ్యాంకు కౌంటర్ ఫైల్ తీసి చూసి ''అవును సార్! పొరపాటు జరిగింది, డిడి కూడా కొరియర్‌లో వెళ్ళిపోయింది'' అన్నాడు భయపడుతూ.

''ఎంత పని చేసావయ్యా! మీరు చేసిన పనికి నా పరువు పోయేట్లుంది. సరే! వెంటనే బ్యాంకుకు ఫోన్ చేసి పేమెంట్ ఆపమని చెప్పు'' అన్నాడు విసుగ్గా. అంతలోనే సార్ అంటూ పరుగెత్తుకొచ్చాడు రామారావ్ ''ఎప్పుడూ లేనిది పొరపాటు జరిగింది సార్!'' ''తమరు ఏం చేసారు?'' అన్నాడు అదే విసుగును పొడిగిస్తూ. ''ఇందాక ఒక కష్టమరుకి ఇరవైవేలు ఇవ్వాల్సి వుండగా రెండు వంద కట్టలకు గాను ఒక కట్ట అయిదువందలది ఇచ్చాను సార్! '' అన్నాడు ఆవేదనగా. నాగరాజ్ కళ్ళు గట్టిగా మూసి కాసేపాగి తెరచి, గట్టిగా ఊపిరి వదిలి ''చేసేది ఏముంది? ఆ డబ్బు తీసుకెళ్ళిన వాడు నిజాయితీగా తెచ్చి ఇస్తేనే మీ సమస్య తీరేది లేకుంటే మీరు కట్టుకోవాల్సిందే'' అన్నాడు సీరియస్‌గా.

అందరూ జుట్టు పీక్కుంటూ అటూ ఇటూ తిరుగుతున్న సమయంలో రోజా వైపు చూసాడు నాగరాజ్. ఆమె ఏదో ఆత్రుతగా కంప్యూటర్ మీద ఏదో చేస్తున్నది. అక్కడకు వెళ్ళి ''నువ్వేం ఘన కార్యం చేసావు తల్లీ?'' అడిగాడు నాగరాజ్. ''సారీ సార్! ఏదో వైరస్ వచ్చినట్లున్నది, ఎంత ప్రయత్నించినా స్కానింగ్ కావడంలేదు, ఇప్పటికే చాలా డేటా పోయింది సార్! అందులో కొన్ని ప్రింట్లు తీయడం కూడా మర్చిపోయా సార్!'' అంది రోజా దాదాపు ఏడుపు స్వరంతో.

నాగరాజ్ మళ్ళీ గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. కోపం బాధ కలిసిన స్వరంతో ''ఏమయింది ఇవాళ మీ అందరికి'' అడిగాడు. రామారావు మెల్లగా ముందుకొచ్చి నిలబడి కాస్త ధైర్యం చేసి ''ఇదంతా మనం ఆఫీస్‌లో చేసిన మార్పుల వల్ల అయి ఉంటుంది సార్! '' అన్నాడు.

నాగరాజ్‌లో ఆవేశం ఉప్పెనలా పొంగింది. ''ఛీ! మీరు మారరు, మీలాంటి వాళ్ళు పని చేస్తున్న ఆఫీస్‌కి మేనేజర్‌గా రావడం నా దురదృష్టం. మీరు చేసే పనులు నాకు అస్సలు నచ్చట్లేదు, ఇలాంటి చోట ఒక్క క్షణం కూడా పని చెయ్యలేను... ఒక్క క్షణం కూడా!'' అని కేకలు పెడుతున్నాడు.

అంతలో ఎవరో ముఖం మీద నీళ్ళు చల్లినట్ల యింది. నాగరాజ్ కళ్ళు తెరచి చూసాడు. ప్రక్కనే వాళ్ళ నాన్న నిలబడి ఉన్నాడు నీళ్ళ గ్లాసుతో. ''నాన్నా! నువ్వెప్పుడొచ్చావు ఆఫీస్‌కి?'' అడిగాడు నాగరాజ్. ''ఆఫీసా నీ తలకాయా!'' అని మళ్ళీ నీళ్ళు చల్లాడు.

ఈసారి తల బాగా విదిలించి చూసాడు నాగరాజ్. ఎదురుగా రెండు కొబ్బరి చెట్లు, తను పడుకున్న మడత మంచం, వీధిలో అటూ ఇటూ తిరుగుతున్న మనుషులు కనబడ్డారు. ''ఏరా! నీకు ఏమి చెప్పాను? ప్రొద్దున్నే ఆంజనేయస్వామి గుడికి వెళ్ళి రోజు పదకొండు ప్రదక్షిణాలు చెయ్యరా! ఆయన సముద్రాలు దాటినట్లు నువ్వు కూడా ఆ మూడవ సంవత్సరం డిగ్రీ దాటి వడ్డున పడతావు అంటే వినకుండా, ఏడు గంటల వరకు పడుకొని కలలు కంటున్నావా? నీకు తెలియదా! నాకు ఇలాంటివి నచ్చవని? త్వరగా లేచి తయారవ్వు'' అంటూ లోపలికి వెళ్ళాడు నాగరాజ్ నాన్న.

★